

సాక్షి గుంటూరు

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



నేడు పోలేరమ్మ తిరునాళ్ల

మంచికల్లు(రెంటచింతల): మంచికల్లు గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఆలయాన్ని పున:నిర్మించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 581.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,578 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కనుల పండువగా గరుడసేవ

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసిన యోగానంద లక్ష్మీ నరసింహ స్వామికి శుక్రవారం రాత్రి గరుడ సేవ జరిగింది. లోకకల్యాణార్థం స్వామికి గరుడ సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్



నగరంపాలెం : జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. జిల్లా వ్యాప్తంగా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ కేసులను పరిష్కరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి పర్యవేక్షించారు. సివిల్ 182, క్రిమినల్ 3407, చెక్‌బౌన్స్ 126, ప్రీ లిటిగేషన్ కేసులు 137 పరిష్కరించారు. మొత్తం పరిష్కారమైన 4,155 కేసుల విలువ రూ. 30.98 కోట్లు ఉందని తెలిపారు.

జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా సురేంద్ర

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గానికి చెందిన గద్దేటి సురేంద్రను పార్టీ గుంటూరు జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘానికి నూతన కమిటీ



లక్ష్మీపురం: ఏపీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 5వ రీజియన్ సమావేశంలో నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఈ మేరకు రీజియన్ గౌరవ అధ్యక్షుడు మేడా హనుమంతరావు తెలిపారు. కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో రీజియన్ మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. కొత్త కమిటీలో అధ్యక్షుడిగా ఎస్. పూర్ణచంద్రరావు, రీజినల్ సెక్రటరీగా కె.శ్రీహరి రాజు, ట్రెజరర్‌గా సయ్యద్ ఖాన్‌తోపాటు 9 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు వివరించారు. అనంతరం నూతన అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు.

కాంట్రాక్ట్ పారా మెడికల్ సిబ్బంది వినతి

తాడేపల్లి రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని ఏపీ కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు శనివారం సీఎం చంద్రబాబుకు మంగళగిరిలో టీడీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ మొత్తం 1,700 మంది హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగాల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. నియామక ప్రక్రియలో పొరపాట్లు సరిదిద్దాలన్నారు. విధుల నుంచి తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. విజయవాడలో వరదలలో సేవలు అందించి అనారోగ్యం పాలైన వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో తోట గిరి, గుండుగొలను నాగరాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా దత్తాత్రేయ జయంతి వేడుకలు



అమరావతి: అమరావతి అమరేశ్వర స్వామి ఆలయంలో శనివారం దత్తాత్రేయుడు, దత్తాత్రేయ పాదాల వద్ద దత్త జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని మేడివృక్షం వద్ద మంగిశెట్టి శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్‌ల నిర్వహణలో కౌశిక చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత దత్తాత్రేయుని విగ్రహానికి, పాదాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి విశేష అలంకారం చేశారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనంతో మొదలైన ఈ పూజా కార్యక్రమం వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల, భక్తుల నామసంకీర్తనల నడుమ రుద్రహోమం, లక్ష్మీగణపతి చండీ హోమం, నవగ్రహ హోమం, దత్తాత్రేయ హోమం నిర్వహించారు. పూర్ణాహుతితో ముగించారు. వేదపండితులు చతుర్వేద ఆశీర్వచనం నిర్వహించి భక్తులకు నీరాజన మంత్ర పుష్పాలను అందించారు. పూజా కార్యక్రమానికి హాజరైన భక్తులందరికి తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఏకగ్రీవాలకు ఆపసోపాలు!

సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమికి అసమ్మతి సెగ

- అన్నిచోట్లా ఏకగ్రీవానికి టీడీపీ నాయకులు విఫలయత్నం
- కొన్ని చోట్ల కూటమి నేతల నుంచే తిరుగుబావుటా
- ఆఖరి నిమిషం వరకు బుజ్జగించినా వెనక్కి తగ్గని నాయకులు
- తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ
- అన్నవర్రులో అధికారుల అడ్డదారులు
- పోలింగ్ బూత్ తలుపులు వేసి ఎన్నికలు



పెదనందిపాడు మండలం అన్నవర్రు పోలింగ్ కేంద్రం మెయిన్ గేట్ తలుపులు ఉదయం 9 గంటలకే మూసి వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు, ఓటర్లు

ప్రత్తిపాడు: సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీలో అసమ్మతి సెగ గట్టిగానే తగిలింది. ఏకగ్రీవాల పేరుతో భయపెట్టో, బుజ్జగించో ఎన్నికలు లేకుండా చేయాలన్న నేతల ప్రయత్నాలు బెడిసికొట్టాయి. కూటమి నేతల నుంచే నిరసన మొదలవ్వడంతో వారిని బుజ్జగించేందుకు చివరి నిమిషం వరకు టీడీపీ నాయకులు పడరాని పాట్లు పడ్డారు. చివరి నిమిషంలో కొందరు రెబెల్స్ పోటీ నుండి తప్పుకోగా, మరికొందరు ససేమిరా అనడంతో ఎన్నికలు అనివార్యం అయ్యాయి. అలాంటి చోట్ల కూడా అధికారులు నిబంధనలు గాలికి వదిలేశారు. నేతలకు పూర్తిగా సహకరించడంతో అక్కడా ఎన్నికలు ఏకపక్షమయ్యాయి. ప్రత్తిపాడు మండలంలో గొట్టిపాడు, పాతమల్లాయపాలెం, వంగిపురం-1, వంగిపురం-2, యనమదల పశ్చిమ మైనర్ వాటర్ ట్యాంకు, యనమదల సాగునీటి సంఘాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. వీటిలో యనమదల పశ్చిమ మైనర్ వాటర్ ట్యాంకు మినహా అన్ని సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. 3వ నంబరు పశ్చిమ వాటర్ ట్యాంకు సంఘంలో కూటమి నేతలే అసమ్మతి స్వరం వినిపించారు. పోటీకి నామినేషన్లు దాఖలు చేయడంతో ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. మొత్తం 6 టీసీలకు ఎన్నికల అధికారిగా జి. కరుణకుమార్ వ్యవహరించారు. అధికార పక్షం నుంచే ఇరువర్గాలు గెలుపుకోసం హోరాహోరీగా ప్రయత్నాలు చేశాయి. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్తిపాడు సీఐ జి. శ్రీనివాసరావు, ఎస్ఐ కె. నాగేంద్రలు బందోబస్తు నిర్వహించారు. ఓటర్ల ఐడెంటిటీ కార్డుల ఆధారంగా లోపలకు పంపారు.

అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం..

ఎన్నికల అధికారుల తీరుపై రైతులు, ఓటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నవర్రులో పోలింగ్ కేంద్రం ప్రధాన ద్వారాన్ని ఉదయం 9 గంటలకే అధికారులు మూసి వేయడంతో ఓటు హక్కుకు దూరయ్యామని బాధితులు తెలిపారు. సాధారణ ఎన్నికల్లానే ఉంటాయనుకున్నామని, కానీ నిర్ణీత సమయం ఉందని తమకు ఎందుకు ముందుగా సమాచారం ఇవ్వలేదంటూ రైతులు గేటు బయట నిలబడి ప్రశ్నల వర్షం కురిపించారు. కాగా అనివార్య పరిస్థితుల్లో మినహా, బహిరంగంగా చేతులెత్తే విధానంలో జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను, ఎన్నికల అధికారులు తలుపులు వేసి ఎన్నికలు జరపడం అధికార పక్షానికి అనుకూలంగా మార్చడానికేనని రైతులు ఆరోపిస్తున్నారు.



ప్రత్తిపాడు మండలం యనమదలలో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు



సమయం వివరాలతో సూచిక ఏర్పాటు చేయకపోవడంతో అన్నవర్రులో అధికారిని ప్రశ్నిస్తున్న రైతులు

తలుపులేసి మరీ ఎన్నికలు



అన్నవర్రులో పోలింగ్ కేంద్రం తలుపులు వేసి లోపల ఎన్నికలు నిర్వహిస్తున్న అధికారులు

పెదనందిపాడు మండలంలో అన్నవర్రు, కట్రపాడు నీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. కట్రపాడులోని అన్ని టీసీలు ఏకగ్రీవమయ్యాయి. అన్నవర్రులో రెబల్స్ స్వరం వినిపించారు. మొత్తం 12 టీసీలకు ఎన్నికలు నిర్వహించగా ఆరు టీసీలు ఏకగ్రీవమయ్యాయి. కూటమి పార్టీల నుంచి రెబల్ అభ్యర్థులు కూడా పోటీలో నిలిచారు. బుజ్జగించిన ఫలితం దక్కలేదు. కాగా 01, 10 టీసీలకు ఎన్నికల అధికారులు పోలింగ్‌బూత్ తలుపులు వేసి మరీ ఎన్నికలను నిర్వహించాల్సి వచ్చింది.



సమయానికి వచ్చినా లోపలకు ఎందుకు పంపరంటూ బూత్‌లో ఓటర్ల నిలదీత

షాపుల స్వాధీనానికి నోటీసులు



కొల్లి శారద మార్కెట్

సాక్షి ఎఫెక్ట్..

నెహ్రూనగర్: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ కొల్లి శారద మార్కెట్‌లోని షాపుల స్వాధీనానికి రెవెన్యూ అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. 1999లో కొల్లి శారద హోల్‌సేల్ మార్కెట్‌లో 88 షాపులను నగరపాలక సంస్థ నిర్మించింది. 25 సంవత్సరాల లీజు గడువుతో కొంత మంది దక్కించుకున్నారు. ఈ గడువు ముగిసినా షాపులను అధికారులు స్వాధీనం చేసుకోలేదు. దీనిపై 'సాక్షి' దినపత్రికలో గత నెల 18వ తేదీన షాపుల స్వాధీనంపై సందిగ్ధం పేరిట కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందిస్తూ.. కొన్నిరోజులుగా కసరత్తు చేశారు. 81 షాపులకు 25 సంవత్సరాల లీజు గడవు పూర్తి అయింది. మిగిలిన 7 దుకాణాలకు గడువు ఉంది. 81 షాపులకు సంబంధించి 66 మంది లీజుదారులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తదుపరి ఉత్తర్వుల ప్రకారం వాటి స్వాధీనానికి చర్యలు తీసుకుంటుండగా... మిగిలి ఉన్న 15 షాపుల స్వాధీనానికి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు కల్పించాలని కోరుతూ పాత గుంటూరు సీఐకు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఓబులేసు లేఖ రాశారు. వీటికి వేలం పాట నిర్వహించి తిరిగి లీజుకు ఇవ్వడం ద్వారా కార్పొరేషన్‌కు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. రెవెన్యూ అధికారులు మాత్రం వీటిని స్వాధీనం చేసుకోకుండా లీజుదారులతో లాలూచీ పడుతుంటారనే ఆరోపణలు లేకపోలేదు. దీనిపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

ఎయిమ్స్ స్నాతకోత్సవానికి ప్రముఖులు

- హాజరుకానున్న రాష్ట్రపతి ముర్ము, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- 17న నిర్వహణకు అధికారుల ముమ్మర ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవ్‌తేజ తదితరులు

మంగళగిరి: అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ప్రథమ స్నాతకోత్సవం ఈ నెల 17వ తేదీన మంగళగిరిలో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఐఎస్‌డబ్ల్యూ అధికారి ఆరిఫ్ హఫీజ్ అధికారులు ఏర్పాట్ల తీరును పరిశీలించారు. రాష్ట్రపతి ఎయిమ్స్‌కు చేరుకునే ప్రవేశ ద్వారం నుంచి బస చేసే ప్రాంతం వరకు, ఆడిటోరియంలో జరిగే వేడుకల సందర్భంగా తీసుకోవలసిన భద్రతా చర్యలపై అధికారులకు వారు పలు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఆడిటోరియంలో జరిగే స్నాతకోత్సవానికి ఉదయం 10 గంటలలోపు ఆహూతులు వచ్చేలా ఎయిమ్స్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఫైర్ సేఫ్టీ వెహికల్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. పాల్గొనేందుకు వచ్చే వీఐపీలు, అధికారులు, ప్రముఖుల వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపైనా సూచనలు చేశారు. కార్యక్రమానికి అవసరమైన పబ్లిక్ అడ్రసు సిస్టమ్ ఎల్ఈడీ, లైవ్ టెలీకాస్ట్ పరికరాలు ముందస్తుగానే అమర్చి కండీషన్ సరి చూసుకోవాలన్నారు. అధికారులకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. 162 బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ, రైల్వే గుంతకల్ ఎస్పీ రాహుల్ మీనా, గ్రే హౌండ్స్ ఎస్పీ సునీల్ షారోన్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, ఎయిమ్స్ డెప్యూటీ డైరక్టర్ శశికాంత్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎస్‌ఓ పి.కోమలి పద్మ, ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ నటరాజ్, అడిషనల్ ప్రొఫెసర్ శంకరన్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు!

రూ. లక్షలు తీసుకుంటూ జీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మౌనముద్ర



వసంతరాయపురం ఓంకారం గుడి పక్క రోడ్డులో నిర్మాణంలో ఉన్న అనధికార కట్టడం



బృందావన్ గార్డెన్స్ ఎస్‌బీఐ అపార్ట్‌మెంట్‌పై అనధికారికంగా నిర్మించిన రెండు ఫోర్లు

కొన్ని ప్రాంతాల్లో అసలు ప్లాన్ లేకుండానే రెండు, మూడంతస్తులు నిర్మాణం

నెహ్రూనగర్ : గుంటూరు నగరంలోని ఇన్నర్ రింగ్ రోడ్డు ఉన్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడికి చెందిన బార్ అండ్ రెస్టారెంట్ నిర్మాణానికి అనుమతులు లేవని శుక్రవారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు కూల్చివేశారు. కానీ నగరంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా... ఆ కట్టడాల జోలికి మాత్రం పోవడం లేదు. యజమానులు ఇచ్చిన నోట్ల కట్టలు తీసుకుని జేబులు నింపుకొంటున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార నిర్మాణాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. కొంత మంది కూటమి నేతల ప్రోద్బలంతో ఇటీవల కమర్షియల్ ప్రాంతాల్లో కూడా అక్రమ కట్టడాలు అధిక సంఖ్యలో నిర్మిస్తున్నారు. మామూళ్లకు అలవాటు పడిన టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారుల నుంచి సిబ్బంది వరకు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ప్లాన్‌కు భిన్నంగా...

గుంటూరు నగరంలో అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ బిల్డింగులు, నివాస భవనాలకు తీసుకునే ప్లాన్‌కు భిన్నంగా నిర్మాణాలు చేపడుతున్నారు. క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలిస్తేగానీ ఈ విషయాలు వెలుగుచూడటం లేదు. వీటిపై టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వారికి ముడుపులు సమర్పించుకుంటే ఫీల్డ్ వెరిఫికేషన్‌కు వెళ్లకుండానే ప్లాన్ మంజూరు చేస్తుంటారని ఆరోపణలు వస్తున్నాయి. కమర్షియల్ ప్రాంతాల్లో సైతం ఇదే పరిస్థితి ఉంది. ఈ అంశాలపై వివరణ కోరగా... క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్రమ కట్టడాలు ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని సిటీ ప్లానర్‌తో రాంబాబు తెలిపారు.

చేతులు మారిన రూ.లక్షలు

బృందావన్ గార్డెన్స్ స్పెన్సర్స్ ఎదురుగా ఎస్‌బీఐ బ్యాంక్ బిల్డింగ్‌పైన (అల్రెడీ ఉన్న భవనంపై) రెండు ఫోర్లు అనధికారికంగా వేశారు దీనికి ప్లాన్ ఇచ్చి ఉంటే నగరపాలక సంస్థకు కొంత మేర ఆదాయం సమకూరేది. కానీ అనుమతులు లేకుండానే సదరు భవన యాజమాని రెండు ఫోర్లు అనధికారికంగా నిర్మించాడు. ఈ విషయంలో రూ.లక్షల్లోనే భారీగా మామూళ్లు తీసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం వసంతరాయపురం ఓంకారం గుడి పక్క రోడ్డులో కూడా అనుమతులు లేకుండా ఓ భవనం నిర్మిస్తున్నా యంత్రాంగం మొద్దునిద్ర నటిస్తోంది.

విలేకరులపై దాడులు హేయం



గుంటూరులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఏపీయూడబ్ల్యూజే నేతలు పుల్లగూర భక్తవత్సలరావు, కె.రాంబాబు

గుంటూరు మెడికల్: పులివెందులలో 'సాక్షి' మీడియా ప్రతినిధులపై జరిగిన దాడి యావత్ జర్నలిస్టులపై జరిగిన దాడిగా భావిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు పుల్లగూర భక్తవత్సలరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి కె.రాంబాబు పేర్కొన్నారు. దాడికి నిరసనగా శనివారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట యూనియన్ సభ్యులు నిరసన తెలిపారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేత పట్టుకుని నిరసన గళం వినిపించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరారు. కలెక్టరేట్‌లో డీఆర్వో ఎస్.ఎం.ఖాజావలికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భక్తవత్సలరావు, రాంబాబులు మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక నుంచి జర్నలిస్టులపై దాడులు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. వృత్తిలో భాగంగా వార్తల సేకరణలకు వెళ్లే ప్రతినిధులపై దాడి చేయడం హేయమని పేర్కొన్నారు. పత్రిక ఏదైనా సరే విలేకరులపై దాడి చేసినవారు, దానిని ప్రోత్సహించిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కఠిన చట్టాలు తీసుకొచ్చి అమలు చేయాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐజేయూ నాయకులు గిరిధర్, మార్కండేయులు, బి.ఎల్.నారాయణ, ఏపీయూడబ్ల్యూజే నగర అధ్యక్షుడు వి.కిరణ్‌కుమార్, కోశాధికారి ఆసిఫ్‌ఖాన్, పరస శ్యామ్, హనీఫ్ ఖాన్, కార్తీక్, రత్నాకర్, మొగలయ్య, హకీమ్ జానీ, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి డి.రమేష్‌బాబు, సాక్షి టీవీ జిల్లా ఇన్‌చార్జి అశోక్, కెమెరామెన్ బాషా, ఫొటోగ్రాఫర్ రామ్‌గోపాల్‌రెడ్డి, అభిరామ్‌రెడ్డి, కిరణ్, ఎం.సి.హెచ్.కోటిరెడ్డి, పి.ప్రశాంత్, షేక్ సుభాని, యాలాద్రి, యాసిన్, ప్రకాష్, కృష్ణ, మల్లేశ్వరరావు, వికర్తన్‌రెడ్డి, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కన్న కొడుకే కాలయముడు




కిరణ్ చంద్ర

బాపట్లటౌన్: బాపట్ల జిల్లా బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి చెందిన పాగోలు విజయభాస్కరరావు (74) రిటైర్డ్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు. ఆయన తన భార్య వెంకట సాయి కుమారి (70)తో అప్పికట్ల గ్రామంలోని స్వగృహంలో ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె లోక కళ్యాణి, కుమారుడు కిరణ్ చంద్ర ఉన్నారు. సంతానానికి వివాహాలు జరిగాయి. కుమారుడు చీరాలలోని పోస్టాఫీసులో ఉద్యోగం చేస్తున్నాడు. అప్పికట్లలోని తల్లిదండ్రుల వద్దనే ఉంటూ రోజూ చీరాల వెళ్తుంటాడు. భార్య , పిల్లలు విజయవాడలో ఉంటున్నారు. కుమార్తె బాపట్లలో ఉంటుంది. దంపతులకు అప్పికట్లలో మూడు అంతస్తుల భవనం, విజయవాడలో మరో ఇల్లు, ప్లాట్లు, పొలాలు ఉన్నాయి. మృతుడికి నెలకు రూ. 60 వేలు పెన్షన్, ఇంటి అద్దెలు సుమారు రూ.20 వేలకు పైగా వస్తున్నాయి. ప్రతి నెలా వచ్చిన సొమ్మును కుమార్తెకు ఇస్తున్నారని, ఆస్తి మొత్తం తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయాలంటూ తల్లిదండ్రులతో వాగ్వివాదానికి దిగుతుండేవాడు. తల్లిదండ్రులు సుముఖత చూపకపోవడంతో శుక్రవారం రాత్రి తల్లిదండ్రులతో తీవ్ర వాగ్వివాదానికి దిగాడు. శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న తల్లిదండ్రులను రోకలిబండతో మోది వారి మోహాలు గుర్తుపట్టని విధంగా నుజ్జునుజ్జు చేసి కిరాతకంగా హత్యచేశాడు.

లైంగిక దాడి కేసులో నిందితులకు రిమాండ్

కొల్లూరు: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు శనివారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికపై గత నెల 26న మండలానికే చెందిన ఆవులవారిపాలెం శివారు క్రీస్తు లంకకు చెందిన ఇరువురు లైంగికదాడికి పాల్పడిన విషయం విదితమే. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటనపై ఈనెల 12న రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాస రావు విచారణ చేపట్టారు. క్రీస్తులంకకు చెందిన విప్పర్ల ప్రేమ్‌కుమార్, బెజ్జం శ్యామ్‌కుమార్‌లు బాలికను బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి కొల్లూరు లాక్ సెంటర్ కరకట్ట వద్దనున్న బస్టాండ్‌లో నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు.బ్యాంక్ కెనాల్‌కు 223, తూర్పు కెనాల్‌కు 82, పశ్చిమ కెనాల్‌కు 51, నిజాంపట్నం కాలువకు 139, కొమ్మమూరు కాలువకు 975 క్యూసెక్కులు విడుదల చేశారు.

రేపటి నుంచి ధనుర్మాస వ్రత ఉత్సవాలు

మంగళగిరి: ఆత్మకూరు బాపూజీ విద్యాలయం ప్రాంగణంలో ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస వ్రత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వైటీఆర్ ట్రస్ట్ చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్ తెలిపారు. శనివారం బాపూజీ విద్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలతో వేడుకలు 16న సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. లైలా గ్రూప్స్ చైర్మన్ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ.. అమరావతిలో ఉత్సవాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పాల్గొంటారన్నారు. రోజూ భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సమావేశంలో క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సెక్రటరీ శ్రీ కూర్మానాథస్వామి, సీతానగరం జీయర్ ఆశ్రమ ప్రతినిధులు పురాణం వెంకటాచార్యులు, మధుసూదనాచార్యులు, సధిమేల రఘునాథ్, రిటైర్డ్ డీఐజీ వెంకటస్వామి , ధ్యానమండలి ప్రతినిధులు అకురాతి శంకరరావు, లక్ష్మి, వికాస తరంగిణి ప్రతినిధులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్ :కాకినాడలో వచ్చే ఏడాది జనవరి 5, 6, 7, 8 వ తేదీల్లో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో శనివారం సభల ఆహ్వాన పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో కాకినాడలోని పీఆర్ డిగ్రీ కళాశాలలో స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో కీలక భూమిక పోషించడంతోపాటు, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు నిరంతరం యూటీఎఫ్ కృషి చేస్తోందన్నారు. విద్యాసదస్సుతోపాటు ఉద్యమ, సాహితీ, మహిళా సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రత్యామ్నాయ విద్యావిధానంపై చర్చించి, తీర్మానాలు ఆమోదిస్తామని తెలిపారు. పలు పార్టీల నాయకులు, సాహితీ వేత్తలు, విద్యారంగ ప్రముఖులు, మహిళా నాయకులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమ కుమారి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజ శేఖరరావు, ఎం.కళాధర్, జిల్లా కార్యదర్శులు జి. వెంకటేశ్వరరావు, ఎండీ షకీలా బేగం, ఎ. శ్రీనివాసరావు, కె. రంగారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.శ్రీనివాస్ కార్తీక్, షేక్ బాజీబాబా పాల్గొన్నారు.

బస్సులను సమయానికి నడపండి

– ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు


ప్రశంసా పత్రాలు అందుకున్న ఉద్యోగులతో ఈడీ అప్పలరాజు, డీపీటీవో రవికాంత్, డీఎం రాజశేఖర్

తెనాలి అర్బన్: ఆర్టీసీ బస్సులను అధికారులు ప్రకటించిన సమయానికి నడపాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు ఆదేశించారు. తెనాలి డిపోను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దూరం ప్రాంతాల బస్సులు సమయానికి డిపో నుంచి బయలుదేరితే మధ్యలో ఉన్న పికప్ పాయింట్ల వద్ద కొద్దిసేపు నిలిపే అవకాశం ఉందన్నారు. ఇలా చేయడం వల్ల ఎక్కువ మంది పాసింజర్లు ప్రయాణించే అవకాశం ఉంటుందని చెప్పారు. సమయ పాలన మాసోత్సవాలు ఒక నెలకు పరిమితం చేయకూడదని, ఇది నిరంతరం ప్రక్రియ అని చెప్పారు. ప్రయాణికులతో ఉద్యోగులందరూ మర్యాదపూర్వంగా వ్యవహరించాలన్నారు. చెయ్యి ఎత్తిన చోట బస్సులు ఆపాలని సూచించారు. అనంతరం అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీపీటీవో ఎం.రవికాంత్, డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఐ.జయప్రసాదరావు, అసిస్టెంట్ మెకానిక్ ఇంజినీర్ అభిరామ్ నాయక్, ఏసీ మెకానిక్ జోషిబాబు, కె.ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో విజయవంతంగా అరుదైన ఆపరేషన్


రోగితో వైద్యులు యశస్వి రమణ, కిరణ్‌కుమార్, గోవిందనాయక్ తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగికి అరుదైన ఆపరేషన్ విజయవంతంగా చేసినట్లు జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గోవింద నాయక్ చెప్పారు. శనివారం ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు మీడియాకు వెల్లడించారు. గుంటూరు రూరల్ మండలం దాసరిపాలెంకు చెందిన షేక్ మొహమ్మద్ టింబర్ డిపోలో పనిచేసేవాడు. మెడ భాగంలో అరుదైన ట్యూమర్ వచ్చిందని, షానోమాగా నిర్ధారించామన్నారు. ఈ నెల 6న ఆపరేషన్ చేశామని తెలిపారు. ఆపరేషన్ సమయంలో ట్యూమర్ వేగస్ నరం నుంచి కాకుండా బేస్ ఆఫ్ ది స్కల్ దగ్గర ఉన్న ఫ్రానిక్ నరం నుంచి వచ్చినట్లు గుర్తించామన్నారు. మూడు గంటల సేపు ఆపరేషన్ విజయవంతంగా చేశామన్నారు. సుమారు రూ. 5 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా చేసినట్లు తెలిపారు. మత్తు వైద్యులు డాక్టర్ పోలయ్య, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ హేమలు పాల్గొన్నట్లు వెల్లడించారు. వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందించారు.